క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

ఉండి : ఉణుదుర్రు గ్రామంలో వేంచేసియున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వాహకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోకరాజు రామరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోదరుడు పి.గోపాలకృష్ణంరాజు, గ్రామ సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ అల్లూరి మాధవి, వర్మ, తదితర నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు డీఎన్నార్ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల పాలకవర్గ ఎన్నికలకు గురువారం నామినేషన్స్ ప్రకియ ప్రారంభం కానుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన కళాశాల పాలకవర్గానికి ఐదేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో సుమారు 4,774 మంది ఓటర్లు ఉండగా ఈనెల 24న పోలింగ్ జరగనుంది. దీనికి గురు, శుక్రవారాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ఎన్నికల అధికారి డాక్టర్ కె రాఘురామ్ చెప్పారు.

నేటినుంచి రావిపాడు ముళ్లమ్మ ఉత్సవాలు

పెంటపాడు: రావిపాడు గ్రామదేవత ముళ్లమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు అమ్మవారిని ముస్తాబు చేసారు. బుధవారం రాత్రి అమ్మవారిని పుట్టింటికి గరగలతో ఊరేగింపు నిర్వహించారు. గురువారం సేవామహోత్సవం జరగనుంది. 4న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేయనున్నట్లు ఆలయ ట్రస్టీ బొచ్చెల తాతారావు సోదరులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : హిందుధర్మాన్ని పరిక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు తెలిపారు. అలాగే సేవాభావం, ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కుంచనపల్లి ద్వారకా నగర్‌లో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రస్తుతం రూ. లక్ష విరాళం అందచేస్తూ భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఒబిలిశెట్టి నటరాజు, ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లికార్జునరావు, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ ఆతుకూరి పవన్‌కుమార్, కార్యదర్శి మర్రి జగదీష్, తాత నాగేశ్వరరావు, గుండు గోపాలం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

పెంటపాడు: పరిసరాల శుభ్రతకు, ఆరోగ్యరక్షణకు ప్రతి ఒక్కరూ తప్పక డ్రైడే పాటించాలని, తద్వారా దోమల నియంత్రణ సాధ్యమవుతుందని గూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వీ. లక్ష్మణరావు పేర్కొన్నారు. ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డా.ఎస్వీ రమణ ఆధ్వర్యంలో బుధవారం దర్శిపర్రు, బిళ్లగుంట గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ మలేరియా నివారణలో భాగంగా ప్రజలు దోమల తెరలు వాడాలన్నారు. కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలన్నారు. ఇంటి లోపల, బయట నీరు నిలువలేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ మార్కండేయులు, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు ఆరోగ్యకార్యదర్శి కె. రత్నం, తేజస్విని, కాంతారావు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

పెంటపాడు: శాస్త్రవేత్తల సూచనలు, వ్యసాయాధికారుల సలహాలు పాటించడంతో పాటు, సేంద్రియ సాగు ద్వారానే జిల్లాలో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె. పార్థసార ధిలు పేర్కొన్నారు. ఆకుతీగపాడు గ్రామంలో క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం వరిపైరుపై ఆశించే తెగుళు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. శాస్త్రవేత్తల సూచనలు సలహాలు పాటించకుండా ఇష్టానుసారంగా పురుగుమందులు వాడకం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పొలంబడిలో రైతుల సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పురుగులు ఆశించకుండా నాట్ల విషయం నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు కొణతాల వెంకట్రావు, వీపీఏలు, రైతులు, వైఎస్సార్ పార్టీ నాయకులు ఆకుల శ్రీను, చింతల నాగరాజు, వీరాబత్తుల నాగసత్యనారాయణ, జాలపర్తి నాగేశ్వరరావు, మోఖమాట్ల వీరన్న, సోమిశెట్టి శ్రీను, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్లుగా.. నిరుపయోగంగా చెరువు


ఆకివీడులోని మూడు సిగ్నల్స్ వద్ద నిరుపయోగంగా ఉన్న తురక చెరువు

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని తురక చాకలి చెరువు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. రైల్వే ట్రాక్‌కు ఉత్తరం వైపున ఉన్న పాతయేరుకు చేర్చి ట్యాంక్ 3.09 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పంచాయతీ ఏర్పడిన తరువాత 25 ఏళ్ల పాటు ఈ చెరువును తురక చాకలి కులస్తులు చాకిరేవుకు ఉపయోగించుకునేవారు. రాను రానూ చెరువు ఆక్రమణలకు గురైంది. చెరువు ప్రాంతం తవ్వకపోవడంతో పూడికలు పేరుకుపోయాయి. గుర్రపుడెక్క, తుంగ వంటివి భారీగా మొలిచాయి. నీటి వినియోగానికి కూడా ఉపయోగంలో లేదు. పశువులు కూడా నీరు తాగేందుకు చెరువు ఉపయోపడటం లేదు. ఆక్రమణలకు గురైన చెరువు ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, మంచినీటి చెరువుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో సమతా నగర్ ప్రాంతంలో జనావాసాలు పెరగడంతో నీటి సమస్య తీవ్రమవుతోంది. చెరువు ప్రాంతంలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం పూర్తి చేసి, చెరువును అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఆకివీడు నగర పంచాయతీలో 100 ఏళ్ల క్రితమే అప్పటి పాలకులు 150 ఏళ్లకు సరిపడే జనాభాకు మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా పట్టణంలో పలు ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల, ప్రస్తుత జనాభాకు సరిపడినన్ని చెరువుల్ని మాత్రమే మంచినీటికి వినయోగిస్తున్నారు. మిగిలిన నాలుగైదు చెరువులు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి. పట్టణంలోని భుజబలరాయుడు, సమ్మర్‌స్టోరేజ్, ఆనాల, గాలిబ్, ధర్మాపురం చెరువులు ప్రజల దాహార్తిని తీరుస్తుండగా దొరగారి చెరువు, కొండయ్య, తురక చాకలి, రాళ్ల చెరువులు నిరుపయోగంగా ఉన్నాయి. తుమ్మల చెరువు, రంగయ్యగుంట చెరువుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్‌స్టాండ్ నిర్మించారు. ఎఫ్‌సీఐ ఎదురుగా ఉన్న 9 ఎకరాల చెరువు పూర్తి ఆక్రమణలకు గురైంది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో ఉన్న చెరువులన్నింటినీ ప్రజా నీటి అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

బాలలకు వైద్య పరీక్షలు

సాక్షి, భీమవరం: భీమవరం ఏఆర్‌కేఆర్ మునిసిపల్ పాఠశాలలో బుధవారం గ్రహణం మొర్రి బాధితులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత శస్త్రచికిత్సలు చేయడానికి నిర్వహించిన వైద్యశిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది గ్రహణం మొర్రి కలిగిన బాధితులు పాల్గొన వారికి డాక్టర్ డి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ రాజేష్, డాక్టర్ జోషి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని జిల్లా సమగ్రశిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎంఎస్ శ్రీమన్నారాయణ పర్యవేక్షించారు.

ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తా

తాడేపల్లిగూడెం అర్బన్: ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కావాడి శివకుమార్ ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కావాడి సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ


గృహసారథి శ్రీనివాస్, పడాల శ్రీనివాసరెడ్డితో కలిసి పింఛన్ అందజేస్తున్న వలంటీర్


రాయకుదురులో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీలో, మండలంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. 8,443 మంది లబ్ధిదారులకు రూ. 2,36,12,750 పింఛన్ సొమ్ము విడుదలకాగా బుధవారం తెల్లవారుజాము నుంచే గృహసారథులతో కలిసి లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేశారు. తొలిరోజు మండలంలో 78.01 శాతం పింఛన్ పంపిణీ చేశారు. మండలంలో 5,273 మంది లబ్ధిదారులకు రూ.1,43,99,750 విడుదల కాగా, రూ.1,12,33,500ను పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులలో 3,170 మంది లబ్ధిదారులకు రూ.87,13,000 విడుదల కాగా మొదటి రోజు 71 శాతం పంపిణీ చేశారు.

తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ

వీరవాసరం: అవ్వ తాతలకు ఇచ్చే పెన్షన్ డబ్బులను బుధవారం తెల్లవారుజామున మండల వ్యాప్తంగా ఆయా వలంటీర్లు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు అందజేశారు. కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లతో కలిసి పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తెల్లవారుజామున పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో గూడూరు ఓంకారం, కోటిపల్లి బాబు, చికెలే మంగతాయారు, గడ్డం భారతీ భాస్కరరావు, కన్వీనర్లు గృహ సారథులు పాల్గొన్నారు.

మండలంలో 89 శాతం పింఛన్ల పంపిణీ

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని 25 గ్రామాలకు బుధవారం 89శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రామచంద్ర ప్రభు తెలిపారు. మండల వ్యాప్తంగా 11,460 పెన్షన్లు ఉండగా వలంటీర్లు మొదటి రోజే 9,170 పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

కష్టించి పనిచేస్తే తగిన గుర్తింపు


మానుకొండ పీటర్ బొలార్, కె. సత్యనారాయణ మూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగ నిర్వహణలో కష్టించి పని చేస్తేనే తగిన గుర్తింపు వస్తుందని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఏవీ రామరాజు అన్నారు. గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తూ మంగళవారం పదవి విరమణ చేసిన మానుకొండ పీటర్ బొలార్, కె. సత్యనారాయణ మూర్తికి బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పదవీ విరమణ అభినందన సభను ఏర్పాటు చేసి జిల్లా గృహనిర్మాణ అధికారి ఏవీ రామరాజు చేతుల మీదగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిద్దరూ విధుల్లో నిబద్ధతతో పనిచేసి తోటి ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. ప్రస్తుతం మానుకొండ పీటర్ బొలార్, సహాయ మేనేజర్‌గా, కె. సత్యనారాయణ మూర్తి, సహాయ ఇంజనీర్‌గా పని చేస్తూ వయోపరిమితపై పదవీ విరమణ పొందారన్నారు. వీరికి జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి, సిబ్బంది పదవీ విరమణ అభినందనలు తెలియజేస్తూ శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డి.ఈ జి.పిచ్చయ్య, భీమవరం, నరసాపురం ఈఈలు బి.వి రమణ, వీవీఎస్ఎస్ సిద్ధాంతి, పలువురు డీఈలు, ఏఈలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే దోహదం


డ్రోన్ రీ సర్వేను ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకోడేరు : భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే దోహదపడుతోందని విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బొల్ల శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో బుధవారం డ్రోన్ రీ సర్వే ప్రారంభమైంది. దీనిలో భాగంగా సర్పంచ్ శ్రీనివాస్ గ్రామానికి సంబంధించిన భూ వివరాలను అధికారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వేను చేపట్టినట్లు చెప్పారు. సొంత భూములు, వివిధ రకాల పంటల ఆయకట్టు, ప్రభుత్వ భూములకు సంబంధించిన విస్తీర్ణం వంటి వివరాలు అన్ని ఈ సర్వే ద్వారా పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ రీ సర్వేకు గ్రామస్తులు, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డీపీ రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కందుల నాగరాజు, కోఆప్షన్ సభ్యులు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, మాజీ సర్పంచ్ పెన్మెత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి


గ్యాస్ ధర పెంపుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆకివీడు : సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల ప్రభావం తీవ్రంగా పడుతున్న తరుణంలో వంట గ్యాస్ ధరను మళ్లీ పెంచిన కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం మండల కార్యదర్శి పెంకి అప్పారావు పిలుపునిచ్చారు. గ్యాస్ ధరల పెంపుపై బుధవారం స్థానిక శ్రీనగర్ కాలనీలో సీపీఎం స్థూపం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థల యజమాన్యానికి వరాలు కురిపిస్తూ, పేదలపై పెను భారం మోపుతున్న మోడీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గట్టి బుద్ధి చెపాలని ఆయన డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించే వరకూ పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్కే.వలీ మహిళలు అమ్మాజీ, రెడ్డి బంగారమ్మ, వాకాడ కస్తూరి, కొలి ఆదిలక్ష్మి, లాల్‌బీ, ఎస్కే.బీబీ, వహీదా పాల్గొన్నారు.

మళ్లీ గ్యాస్ భారం

సాక్షి, భీమవరం: వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 50 పెంచడాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సబ్సిడీని ఎత్తివేస్తున్న కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర మాత్రం పదిహేను రోజులకొకసారి పెంచడం దారుణమన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన


విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న పుష్పరాజ్

పాలకోడేరు : డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమని, అంబేడ్కర్ జయంతి నాటికి విగ్రహావిష్కరణ జరిపేలా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. గరగపర్రులో డా.బీఆర్ అండేబ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై తలెత్తిన వివాదం అందరికి తెలిసిందేనన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విగ్రహం నెలకొల్పుతామని ఇచ్చిన హామీ ప్రకారం అందుకు చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. అలాగే ఆ సమయంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులను కూడా ప్రభుత్వం ఉపసహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా ఇన్‌చార్జి నేతల సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, సత్యమాల అశోక్, పిట్టా వినోద్ కుమార్, జొన్నల వజ్రం, నన్నేటి నాగరాజు, నేతల సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

పాలకొల్లు అర్బన్: శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న తనతో పాటు వంక రవీంద్రనాథ్‌కి మొదటి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయాలని జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణం తీర్చుకునే అవకాశం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు లభించిందన్నారు. వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి తమ విజయానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన తరువాత తాను పాలకొల్లులోనే ఉంటానని అన్నారు. 2024లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించి సీఎం జగన్‌కి బహుమతిగా ఇవ్వాలని పిలుపు నిచ్చారు. మరో ఎమ్మెల్సీ అభ్యర్థి, పారిశ్రామికవేత్త వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపరులో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న కవురు శ్రీనివాస్, తన పేరు ఉంటాయని, పేర్లకి ఎదురుగా బాక్స్ ఉంటుందన్నారు. బాక్స్‌లో కేవలం, 1, 2 అని అంకెలు మాత్రమే వేయాలని సూచించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఎంపీపీలు చిట్టూరి కనకలక్ష్మి, రావూరి వెంకటరమణ, సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, వైస్ ఎంపీపీలు పడవల సునీల్ బాబు, గొల్లపల్లి శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, డీటీడీసీ బాబు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, చిట్టూరి ఏడుకొండలు, ఎం.మైఖేల్‌రాజు, పార్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు స్టార్టప్‌లు ప్రారంభించాలి


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న నిశాంత్‌వర్మ

సాక్షి, భీమవరం: ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్టార్టప్‌లు ఏర్పాటుచేసి మరికొంత మందికి ఉపాధి కల్పించాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిషాంత్ వర్మ అన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్‌కు చెందిన పలువురు విద్యార్థులు డాక్టర్ ఎం సురేష్ బాబు పర్యవేక్షణలో భీమవరం ఆన్‌లైన్ క్యాంపస్ కేఫ్‌బై ఎస్ఆర్‌కేఆర్ ప్రారంభించగా కళాశాల పూర్వ విద్యార్థి రాజశేఖర్ పర్యవేక్షణలో అంధులకు ఉపయోగపడే స్మార్ట్ విజన్ బై ఎస్ఆర్‌కేఆర్ అనే స్టార్టప్‌ను టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎస్ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో రూపొందించారు. ఈ రెండింటికీ ఇటీవల ఎన్ఐటీ తాడేపల్లిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో బుధవారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన అనేక హెక్తాన్ పోటీల్లో బహుమతులు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎస్ గోపాలకృష్ణమూర్తి, సీఎస్‌డీ విభాగం హెడ్ డాక్టర్ ఎం సురేష్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ పోటీల్లో ప్రథమస్థానం

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి కళాశాల అధ్యాపకుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ అధ్యాపకులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు చెప్పారు. గురువారం కళాశాలలో విజేతలను అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. గుంటూరులోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కాలేజీ టీచర్స్ షటిల్ టోర్నమెంట్‌లో 45 ప్లస్ డబుల్స్ విభాగంలో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్ బి రవికుమార్‌వర్మ, హ్యూమనిటీస్ విభాగం ప్రొఫెసర్ కె కిరణ్‌కుమార్ వర్మ ప్రథమ స్థానంలో విజయం సాధించి జ్ఞాపికను గెల్చుకున్నారన్నారు. కిరణ్‌కుమార్‌వర్మకు బెస్ట్ ప్లేయర్ అవార్డు దక్కిందన్నారు. అనంతరం విజేతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్‌వర్మ సత్కరించారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

సాక్షి, భీమవరం: దళితులంతా ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి అవకాశముంటుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. బుధవారం రాయలం గ్రామంలో నిర్వహించిన మాల మహానాడు నూతన కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భీమవరం పట్టణ అధ్యక్షుడు గొర్ల గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో భీమవరం నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా మానుకొండ కిరణ్, యాడంగి రవి, ఉపాధ్యక్షుడిగా కోణాల రాజశేఖర, రాయలం గ్రామ అధ్యక్షుడిగా సోడదాసి రాజు, ఉపాధ్యక్షుడిగా పుచ్చకాయల అనిల్‌ను నియమించి వారికి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా ఇన్‌చార్జ్ నేతల సువర్ణ రాజు, కోలాటి ప్రసాదరావు, పిట్టా వినోద్ కుమార్, దాసరి చిరంజీవి, పెనుమాల చందుబాబు, నేతల సాల్మన్ రాజు పాల్గొన్నారు.

సాగునీరు సక్రమంగా అందించేందుకు చర్యలు

భీమవరం అర్బన్: దాళ్వా సాగులో ప్రస్తుతం వంతులవారి విధానం నడుస్తోందని పంట పొలాలకు సాగు నీరందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. తాడేరు, తుందుర్రు, బేతపూడిలోని పంట పొలాలకు ఆరు రోజుల వరకు వంతుల వారీ విధానంలో సాగునీరు సరఫరా అవుతోందన్నారు. ఆయకట్టు శివారుకు సాగు నీరందకపోతే రైతులు ఆర్‌బీకే సెంటర్లలోని వ్యవసాయ సిబ్బందిని, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం తెలిపితే పరిష్కరిస్తారని అన్నారు. మండలంలో సుమారు 9 వేల ఎకరాలకు ఈ-కేవైసీ పూర్తి చేసినట్టు తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పెనుగొండ: రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు బూసి వినీత బుధవారం పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటును పరిశీలించారు. కిచెన్, బాత్రూంలను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అన్నం మరీ మెత్తగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికా బద్దంగా అభ్యాసం, అవగాహన కల్పనపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, ప్రిన్సిపాల్ ఎస్తేరు రాణి వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల జాతర ప్రారంభం


కలశ పూజ చేస్తున్న చైర్మన్ రంగరాజు దంపతులు

కాళ్ల : మండలంలోని బొండాడ గ్రామంలో శ్రీపోలేరమ్మ శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల జాతర బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద కలశస్థాపన చేశారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స రంగరాజు దంపతులచే వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి 9 రోజులపాటు అమ్మవార్ల జాతర నిర్వహిస్తామని ఆలయ ఈవో ఆంజనేయరాజు తెలిపారు. జాతరలో భాగంగా గవర్ల గుడుపు సేవలు, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నె నాగరాజు, గ్రామ పెద్దలు, భక్తులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో 4న ఐఏఎల్ సమావేశం

సాక్షి, భీమవరం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) సమావేశం ఈనెల 4న భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ జిల్లా కన్వీనర్ చెల్లబోయిన రంగారావు బుధవారం తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె రఘురామ్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి హైకోర్టు జడ్జిలు ఆకుల వెంకటశేషసాయి, వీఆర్‌కే కృపసాగర్, బీవీఎల్ఎస్ చక్రవర్తి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, ఏపీ బార్‌కౌన్సిల్ సభ్యుడు ఎం సుబ్బారావు, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ పాల్గొంటారని రంగారావు తెలిపారు.

గ్యాస్ ధర తగ్గించాలి

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం భీమవరం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం 38వ వార్డు లంకపేటలో గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గ్యాస్ బండలతో నిరసన ధర్నా చేశారు. అనంతరం సీపీఎం పట్టణ నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో రూ.400 ఉండే గ్యాస్ బండ ధరను రూ. 1,200 పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో ప్రజలు సతమతమవుతుంటే ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచుతున్నారని వాపోయారు. ఈకార్యక్రమంలో సోమేశ్వరం, కొమరగిరి సాయమ్మ, ఇమ్మానియేల్, రమేష్, కుమారి, మరియమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.